క్లుప్తంగా

కారు టైరు పేలి.. డివైడర్ దాటి

ప్రత్తిపాడు: 16వ నంబరు జాతీయ రహదారిపై కారు బీభత్సం సృష్టించింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం గుంటూరుకు చెందిన వెన్నపూస బ్రహ్మారెడ్డి బాడుగ కోసం గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు ట్రక్కు ఆటోలో వెళుతున్నాడు. అదే సమయంలో గుంటూరు నుంచి నరసరావుపేట వెళుతున్న కారు టైర్ ప్రత్తిపాడు మండలం యనమదల సమీపంలో పేలింది. దీంతో ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టడంతో ఆటో పక్కనున్న సర్వీసు రోడ్డులోకి పడిపోయింది. డ్రైవర్ కారును అదుపు చేసే యత్నం చేసినా నియంత్రణలోకి రాలేదు. కారు డివైడర్‌ను దాటి ఎదురు రోడ్డులోకి దూసుకెళ్లి, మార్జిన్‌లో ఉన్న ఇనుప రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ బ్రహ్మారెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అతడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కారులోని ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. వారిని స్థానికంగా ఉన్న కాటూరి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, నరసరావుపేట తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వారి వివరాలు తెలియరాలేదు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

వినూత్న ఆలోచనలతో దేశాభివృద్ధి

ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ కె మధుమూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి

గుంటూరు రూరల్: వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర విజన్ లక్ష్య సాధనలో విద్యార్థులూ భాగస్వాములవ్వాలని, వినూత్న ఆలోచనలే దేశాభివృద్ధికి మార్గాలని ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి తెలిపారు. ఏఐసీటీఈ (అఖిల భారత సాంకేతిక విద్యామండలి), మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో వాధ్వాని ఫౌండేషన్ నేతృత్వంలో ఐదు రోజుల పాటు జరగనున్న ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ బూట్ క్యాంపు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ కె.మధుమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలో దేశం మొత్తంలో ఒకే సమయంలో 11 ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సౌత్ ఇండియా రీజియన్ పరిధిలో ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు అవకాశం లభించడం విశేషమన్నారు. కళాశాలలో మెరుగైన విద్యతోపాటూ పరిశోధనలకు అనువైన వసతులు, సాంకేతిక నైపుణ్యాల పెంపునకు ఆసరాగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలే పెట్టుబడులుగా మారి, నూతన స్టార్టప్‌లకు బీజం వేయాలని ఆకాంక్షించారు. అవేరా ఏఐ మొబిలిటీ ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ ఎ.వెంకటరమణ మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా స్టార్టప్‌లను నెలకొల్పాలన్నారు. ఇటువంటి శిబిరాలు విద్యార్థుల ఆలోచనలకు బాటలు వేయడానికి ప్రేరణ కలిగిస్తాయని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఏఐసీటీఈ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఇంజ నాగభీమలింగేశ్వర్‌రెడ్డి, వాధ్వాని ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సుప్రభా ఆర్.డాక్టర్ ద్రిష్టడేజోయార్డర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కార్యక్రమ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టాటా మోటార్స్ నూతన టియాగో విడుదల



పెదకాకాని: టియాగో కారులో నూతనంగా ఏర్పాటు చేసిన 10.25 ఇంచెస్ టచ్ స్క్రీన్, ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, ఫ్రంట్ బంపర్ డిజైన్ స్టైల్‌గా ఇచ్చినట్టు జాస్పర్ షోరూం జనరల్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. గుంటూరు ఆటోనగర్‌లో సోమవారం జాస్పర్ టాటా కార్ షోరూంలో టాటా మోటార్స్ వారి నూతన టియాగో, టిగోర్, టియాగో ఈవీ కార్లను నూతనంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆటోనగర్‌లో అరండల్‌పేట ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సింధూర, లక్ష్మీపురం బ్రాంచ్ మేనేజర్ సుభాని, సుందరం ఫైనాన్స్ గుంటూరు మేనేజర్ వి.సుబ్రమణ్యంల చేతుల మీదుగా కొత్త కార్లను లాంచ్ చేశారు. మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ టియాగో ప్రారంభ ధర రూ.4.99 లక్షలు, టిగోర్ ప్రారంభ ధర రూ.5.99 లక్షలు, టియాగో ఈవీ ధర రూ.7.99 లక్షలుగా టాటా మోటార్స్ నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

వాగ్దానాలు అమలు చేయకుంటే చలో అసెంబ్లీ


ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుంటే చలో అసెంబ్లీ చేపట్టి తీరుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు చెప్పారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల సమయంలో అంగన్‌వాడీలతో చలో అసెంబ్లీ చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు ప్రేమలత, నాయకులు కరీమున్, శ్రీవాసవి, శశికళ, అనురాధ, పద్మ, పార్వతి, సెక్టార్ నాయకులు పాల్గొన్నారు.

శివాలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ చెప్పారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి సోమవారం నూతక్కి గ్రామానికి చెందిన బొల్లా సాంబరెడ్డి విజయలక్ష్మి దంపతులు 51,116 రూపాయల విరాళం సమర్పించారు. ఈ సందర్భంగా డీసీ లీలాకుమార్ మాట్లాడుతూ దాతల సహకారం అభినందనీయమన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కాకుమాను: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈఓ ముద్దన శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహక సంఘం అధ్యక్షురాలు మర్రి లక్ష్మి మాట్లాడుతూ గత ఏడు నెలలుగా బిల్లులు రావాలని పేర్కొన్నారు.

రైతు చల్లగా.. పంట తా'జాగా'

- కల్పతరువులు.. కోల్డ్ స్టోరేజ్‌లు
- జిల్లా వ్యాప్తంగా 120కిపైగా శీతల గిడ్డంగులు
- అన్ని వసతులతో అందుబాటులో..



కొరిటెపాడు(గుంటూరు): గతంలో పండించిన పంటలను నిల్వ చేసుకోవాలంటే రైతులు అనేక కష్టాలను చవిచూసేవారు. అప్పట్లో చేసేది ఏమిలేక ఇళ్లల్లోనూ, పొలాల్లోనూ వాటిని జాగ్రత్తగా భద్రపరచుకునేవారు. అంతేగాక దాచిన పంట కీటకాలు, ఇతరత్రా మూషికాల బారినుంచి కాపాడుకునేందుకు అనేక అవస్థలను ఎదుర్కొనేవారు. క్రమేణా ఆ బాధల నుంచి రైతులు బయటపడ్డారు. పండించిన పంట తొలినాళ్ళల్లో ఏ విధంగా ఉందో.. నెలలు గడిచినా, అమ్మే వరకు సరకు అలాగే తాజాగా ఉంటుంది. అందుకు కారణాలు లేకపోలేదు. రైతులు పండించిన పంటను సుదీర్ఘ కాలం పాటు నాణ్యంగా ఉంచేందుకు శీతల గిడ్డంగులు(కోల్డ్ స్టోరేజ్‌లు) సిద్ధంగా ఉన్నాయి. శీతల గిడ్డంగులు పదుల సంఖ్యలో కాదు.. వందల్లో ఏర్పడ్డాయి. దీంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గుంటూరు జిల్లాలో సుమారు 120కిపైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. గుంటూరు నగరానికి అనుసంధానంగా సుమారు 90 శీతల గిడ్డంగులు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడికి గుంటూరు జిల్లాతోపాటు కర్నూలు, ప్రకాశం, కృష్ణా జిల్లాలు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని రైతులు పంట ఉత్పత్తులు తీసుకువచ్చి నిల్వ చేసుకుంటున్నారు. అక్కడ సరిపడా శీతల గోదాములు లేకపోవడం వల్ల గిట్టుబాటు ధరలు లేనప్పుడు పంటలను గుంటూరు తీసుకొస్తున్నారు.

అత్యాధునిక వసతులు

ఇక్కడి కోల్డ్ స్టోరేజీల్లో విశాలమైన గదులు, లిఫ్ట్ సౌకర్యం, రైతుల బస చేసేందుకు వీలుగా విశ్రాంతి గదులు ఉన్నాయి. తక్కువ ధరలకే పంట బస్తాలను అద్దెకు భద్రపరుచుకునేలా ఏర్పాట్లు ఉన్నాయి. దీంతో గుంటూరు నగర శివారు ప్రాంతాలతోపాటు కర్నూలు, అనంతపురం, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి నుంచి రైతులు తమ మిర్చి సరుకును భద్రపరుచుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగులను ఆశ్రయిస్తుంటారు. వారి రాకతో గిడ్డంగులు నిండు కుండల్లా కళకళలాడుతున్నాయి. చాలా గిడ్డంగుల్లో యాజమానులు రైతులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంటున్నారు. కొంద రైతే రైతులకు రుణాలు సైతం ఇప్పిస్తున్నారు. దీంతో రైతుల పాలిట కల్పతరువుగా గిడ్డంగులు మారాయి. అదే విధంగా వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన సరుకు ఏదైనా అమ్మకం జరగకపోయినా వెంటనే గిడ్డంగుల్లో అరబెట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీనికితోడు శీతలీకరణ (ఏసీ) నిర్వహణ బేషుగ్గా ఉంటుంది. 6 నుంచి 8 డిగ్రీల వరకు శీతలీకరణ ఉంచుతున్నారు. ఉదాహరణకు ఏదైనా రకం మిర్చి రూ.10 వేలు పలికితే, ఆ ధర రైతుకు గిట్టుబాటు కాదని భావించి గిడ్డంగుల్లో నిల్వ చేసుకుంటే అదే మిర్చి రూ.15 వేలకు మించి ధర పలికినప్పుడు విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుంది. దీనివల్ల రైతు లాభపడినట్లే. ప్రత్యేక సందర్భాల్లో తప్ప సరుకు నాణ్యంగానే ఉంటుందని, రైతులు పురుగు మందుల వాడకం ఆధారంగా కూడా సరుకు నిల్వపై ప్రభావం చూపుతుందని గిడ్డంగుల యాజమానులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు రైతులు మంచి విత్తనాలు తీసుకుని దానికి అనుగుణంగా మందుల వాడకం చేస్తే అధిక దిగుబడికి అవకాశం ఉంది. దీనికి తోడు సరుకులో నాణ్యత పెరుగుతుంది. గత ఏడాది మార్చి నెలలో సుమారుగా క్వింటా మిర్చి ధర రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఉండగా ఇప్పుడు క్వింటా రూ.10 వేల నుంచి రూ.13 వేల లోపు మాత్రమే పలుకుతోంది. దీంతో రైతులు తాము తీసుకొచ్చిన మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వచేసుకుంటున్నారు. ప్రస్తుతం మిర్చి ధర తక్కువగా ఉండటంతో యార్డులో విక్రయాలు కొంతమేర నిలిచిపోవడంతో చేతికి వచ్చిన పంటను ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి రైతుల్లో నెలకొంది. దీంతో చాలా మంది మిర్చి రైతులు జిల్లాలోని శీతల గిడ్డంగుల వైపు పరుగులు తీస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులు సైతం రైతులను దృష్టిలో పెట్టుకుని తక్కువ ధరలకే పంటల నిల్వకు అవకాశం కల్పిస్తున్నారు. రైతులు నిల్వ ఉంచిన సరుకును ఎంచక్కా అధిక ధరలకు విక్రయించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సరకు నిల్వ చేసుకోవడం వల్ల మంచి ధర పలికే అవకాశం ఉంది.

తక్కువ ధరలకే నిల్వ సౌకర్యం



రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరలకే పంటను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. దీనికితోడు సరుకు పాడవకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాం. రైతులు పండించిన పంటను సకాలంలో అమ్ముకోవాలంటే ఒక్కోసారి కుదరదు. ఎందుకంటే పండిన పంటకు కాస్తంత ధర పలికితే విక్రయించాలని రైతులు చూస్తుంటారు. ఒక్కొక్కసారి గిట్టుబాట ధర లభించకపోవచ్చు. గిట్టుబాటు ధర లేనప్పుడు రైతు సరుకును గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని ఆశించిన ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చు. కొన్ని కోల్డ్‌స్టోరేజీల యాజమాన్యాలు రైతులకు బ్యాంకు రుణాలు సైతం అందిస్తున్నాయి. ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ కల్పిస్తే రైతులకు తక్కువ ధరకే సరుకును భద్రపరుచుకునేందుకు అవకాశం ఉంటుంది.

–వణుకూరి వెంకటేశ్వరరెడ్డి,
శ్రీ లక్ష్మీనరసింహ కోల్డ్‌స్టోరేజీ అధినేత.

గిడ్డంగుల్లో 25 లక్షల మిర్చి బస్తాలు నిల్వ



కోల్డ్‌స్టోరేజ్‌లకు ఇప్పుడిప్పుడే మిర్చి బస్తాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు 10 లక్షల టిక్కీలు పాతవి, మరో 15 లక్షల టిక్కీలు కొత్త సరుకు చేరుకుంది. రైతులకు మంచి సర్వీసు అందిస్తున్నాం. మొత్తంగా 25 లక్షల బస్తాలు రైతులు నిల్వ చేసుకోవడం జరిగింది. బస్తా ఒక్కంటికి రైతు నుంచి రూ.175 మాత్రమే వసూలు చేస్తున్నాం. ముఠా కూలీ, ఇన్సూరెన్స్ కోసం రైతు అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. కోవిడ్ కాలంలో కూడా గిడ్డంగులు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. రైతుల సరుకు నాణ్యత విషయంలో గిడ్డంగుల యాజమానులు ఏ ఒక్కరూ రాజీపడటం లేదు. అందులో శీతలీకరణ(ఎయిర్ కండిషన్)లో మరింత నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులకు మంచి సర్వీసు ఇవ్వాలన్నది ప్రతి యాజమానిలో ఉంది.

–పి.సురేంద్రబాబు,
ది కోల్డ్ స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి